ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
మంగళవారం 23 జనవరి 2024





సాలూరులో...



తోటపల్లిలో...

శ్రీరామ జయము

- జిల్లాలో వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ
- మార్మోగిన శ్రీరామ నామం
- అంతటా పూజలు, శోభాయాత్రలు
- అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను టీవీల్లో చూసి పులకించిన 'మన్యం' వాసులు



సాలూరులో శోభాయాత్ర



పార్వతీపురంలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



జియ్యమ్మవలస: చినకుదమలో...

పార్వతీపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి)/ పార్వతీపురం టౌన్/ పాలకొండ/ గరుగుబిల్లి/ సాలూరు/ సాలూరు రూరల్: జిల్లాలో శ్రీరామ నామం మార్మోగింది. అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. రామ భజనలు, శోభాయాత్రలు, కోలాటాలు, ప్రత్యేక పూజలతో గ్రామాలు, పట్టణాలు శోభిల్లాయి. రామాలయాలు, ఇతర దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. జై శ్రీరామ్ అంటూ అర్చనలు, అభిషేకాలు, దీపారాధనలు చేశారు. అయోధ్యలో రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను జిల్లా ప్రజలు ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వీక్షించారు. మొత్తంగా ఎటూ చూసినా రామనామస్మరణే వినిపించింది. పార్వతీపురంలో కుసుమగుడ్డి వీధి, పాతబస్టాండ్ కూడలి సమీపంలోని సీతారామ స్వామి ఆలయాల్లో సోమవారం ఉదయం 5 గంటల నుంచి ప్రత్యేక పూజలతో పాటు అర్చనలను చేశారు. పట్టణ హిందు ధర్మపరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పాతబస్టాండ్ కూడలి నుంచి బెలగాం కూడలి శివారు వరకు బైకు ర్యాలీ నిర్వహించారు. పాలకొండలోని నాలుగో వార్డు వాసులు సీతారాముల ఉత్సవ విగ్రహాలకు తిరువీధి నిర్వహించారు. మహిళలు కలశాలతో ఊరేగింపుగా వెళ్లారు. పలు వీధుల్లో భజనలు చేశారు. మరికొందరు కోలాటం, గంగిరెద్దుల ఆటలతో సందడి చేశారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ఎంఎంనగర్ మీదుగా ఏలాం జంక్షన్ నుంచి కోటదుర్గమ్మ అలయానికి చేరుకుంది. అక్కడ నుంచి మళ్లీ ఆలయానికి చేరుకుంది. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించారు. సాయంత్రం భారీ ఎత్తున జై శ్రీరాం అంటూ బైక్ ర్యాలీ చేపట్టారు. గరుగుబిల్లి మండలం తోటపల్లిలోని కోదండరామస్వామి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. సాలూరు పట్టణంలో వైభవంగా శోభాయాత్రలు నిర్వహించారు. కల్యాణ వేంకటేశ్వర ఆలయం నుంచి వెలంపేట, మెంటాడవీధి, వేంకటేశ్వర కాలనీ, వేణుగోపాలస్వామి వీధుల గుండా రాముని రథాలతో శోభాయాత్ర జరిగింది. భారీసంఖ్యలో జనం పాల్గొని జైశ్రీరామ్ నినాదంతో హోరెత్తించారు. ఇక డబ్బివీధి, పెదకోమటిపేట రామలీల కమిటీలు కూడా రాముని ఉత్సవ విగ్రహాలతో శోభా యాత్ర నిర్వహించారు. ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా సాలూరు సీఐ జీడీ బాబు స్వయంగా పర్యవేక్షించారు. జియ్యమ్మవలస మండలం చినకుదమలో మహిళలు కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. ఇక రాత్రి వేళ ప్రతి ఇంటా రామజ్యోతులు వెలిగించారు. పలువురు బాణసంచా కాల్చారు. రామ మందిరాల్లో హనుమచాలీసా పారాయణం చేశారు.



పాలకొండలో కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

జిల్లాలో ఓట్లు 7,75,598

- తుది జాబితా విడుదల

పార్వతీపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : ఓటర్ల తుది జాబితాను సోమవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ.. తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తంగా 7,75,598 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ ప్రక్రియను ఈ నెల 12 వరకు చేపట్టామన్నారు. జిల్లాలోని 1031 పోలింగ్ కేంద్రాల పరిధిలో 3,78,764 మంది పురుషులు, 3,96,766 మంది స్త్రీలు, 68 మంది థర్డ్‌జెండర్లు ఉన్నారని చెప్పారు. ఇందులో పాలకొండ (ఎస్టీ)నియోజకవర్గంలో 94,328 మంది పురుషులు, 99,325 మంది మహిళలు, 14 మంది థర్డ్ జెండర్ వెరసి 1,93,667 మంది ఓటర్లుగా నమోదయ్యారు. కురుపాం (ఎస్టీ)లో 93,592 మంది పురుషులు, 99,005 మంది మహిళలు, 39 మంది థర్డ్‌జెండర్స్‌తో కలిసి మొత్తంగా 1,92,636 మంది ఓటర్లు ఉన్నారు. పార్వతీపురం (ఎస్సీ)లో 92,655 మంది పురుషులు, 95,188 మంది మహిళలు, 11 మంది థర్డ్‌జెండర్స్ వెరసి 1,87,854 మంది ఓటర్లు, సాలూరు(ఎస్టీ)లో 98,189 మంది పురుషులు, 1,03,248 మంది మహిళలు, నాలుగు థర్డ్ జెండర్‌తో కలిపి మొత్తంగా 2,01,441 మంది ఓటర్లు ఉన్నారని ఆయన వివరించారు. ఈ సమావేశంలో డీఆర్వో జె.వెంకటరావు తదితరులున్నారు.

పెరిగిన ఓటర్లు

తాజాగా విడుదల చేసిన ఓటర్ల తుది జాబితా ప్రకారం జిల్లాలో ఓటర్ల సంఖ్య పెరిగింది. 2019తో పోల్చితే 65,999 మంది ఓటర్లు పెరిగారు. కొత్తగా నాలుగు నియోజకవర్గాలతో ఏర్పడిన జిల్లాలో ఓటర్లు 7,75,598 మందిగా ఉన్నారు. గత ఎన్నికల సమయంలో చూసుకుంటే పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల్లో 7,09,599 మంది ఓటర్లు ఉన్నారు. కొత్తగా ఓటర్లుగా చేరిన వారి సంఖ్య 29,975 మంది కాగా డబుల్ ఎంట్రీతో పాటు మృతులు తదితర కారణాలతో తొలగించి వారి ఓటర్లు సంఖ్య 24,902గా నమోదైంది. మొత్తంగా పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా ఉంది. 2014 ఓటరు జాబితాలో పురుష ఓటర్ల సంఖ్య 34,9413 మంది, మహిళా ఓటర్లు 360129 మంది, ఇతరులు 57 మంది ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

గతంతో పోలిస్తే ఓటర్లు ఇలా ..

నియోజకవర్గాలు	2019	2024	పెరిగిన ఓటర్లు
పాలకొండ	1,74,219	1,93,667	19,450
కురుపాం	1,76,977	1,92,636	15,659
పార్వతీపురం	1,75,625	1,87,854	12,229
సాలూరు	1,82,778	2,01,441	18,663

పాఠశాలల్లో ఓటరు దినోత్సవం: డీఈవో

గరుగుబిల్లి : జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం ఆదేశాలను విధిగా పాటించాలన్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే మండల విద్యాశాఖ అధికారులకు అవసరమైన సూచనలు అందించామన్నారు. ఓటు ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించడంతో పాటు ప్రతిజ్ఞ చేయించాల్సి ఉందని తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల అరెస్టులు దారుణం

- సర్కారు తీరుపై వామపక్షాల మండిపాటు
- జిల్లాకేంద్రంలో రాస్తారోకో

బెలగాం, జనవరి 22: తమ సమస్యలు పరిష్కరించాలని చలో విజయవాడకు తరలివెళ్లిన అంగన్‌వాడీలను పోలీసులు అరెస్ట్ చేయడం దారుణమని వామపక్షాల నాయకులు అన్నారు. సర్కారు చర్యలను ఖండిస్తూ.. అంగన్‌వాడీలకు సంఘీభావంగా సోమవారం కలెక్టరేట్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. నిర్బంధాలు, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరన్నారు. గత 42 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తున్నా సర్కారు స్పందించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. చర్చల పేరిట కాలయాపన చేసి.. నేడు నోటీసులు, ఎస్మాతో బెదిరింపులకు దిగడం తగదన్నారు. మరోవైపు తక్షణమే విధుల్లో చేరకుంటే తొలగిస్తామని డెడ్‌లైన్ విధించడంపై వారు మండిపడ్డారు. విజయవాడకు బయల్దేరిన జిల్లా అంగన్‌వాడీలను విజయనగరంలో పోలీసులు అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం తీరు మార్చుకోవాలని లేకుంటే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించు కోక తప్పదని హెచ్చరించారు. గతంలో సీఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు అంగన్‌వాడీలకు మద్దతుగా అన్ని వామపక్షాలు, ప్రజా సంఘాలు ఉంటాయని తెలిపారు. ఈ నిరసనలో సీపీఎం, సీపీఐ, సీపీఎంల్ నేతలు రెడ్డి వేణు, వెంకటరమణ, మన్మథరావు, సంఘం, నర్సింగరావు, భాస్కర రావు, రాము, సన్యాసిరావు, సీఐటీయూ, ఏఐటీయూ, అంగన్‌వాడీ సంఘ నాయకులు పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి తగిన విధంగా బుద్ధి చెబుతామని హెచ్చరించారు.



పార్వతీపురంలో రాస్తారోకో చేస్తున్న వామపక్ష నాయకులు

గిరిజన సంఘం నాయకుల హౌస్ అరెస్టు

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీ వర్కర్ల చలో విజయవాడ కార్యక్రమం నేపథ్యంలో భద్రగిరిలో గిరిజన సంఘం నాయకుడు మండంగి రమణను సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు ఎల్విన్‌పేట పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. మరో గిరిజన సంఘం నాయకుడు కోలక అవినాష్‌ను ఇరిడి గ్రామంలో పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అయితే దీనిపై గిరిజన, ప్రజా సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

20 మందికి టెర్మినేషన్ నోటీసులు

పార్వతీపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలను ఉద్యోగాల నుంచి తొలగించే ప్రక్రియను ప్రభుత్వ ప్రారంభించింది. దీనిలో భాగంగా సోమవారం జిల్లాలో 20 మందికి తొలగింపు ఉత్తర్వులను రిజిస్టర్ పోస్టులో పంపించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు టెర్మినేషన్ నోటీసులు అందించినట్లు ఐసీడీఎస్ పీడీ ఎంఎన్.రాణి తెలిపారు. ఇప్పటివరకు 385 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 260 మంది సహాయకులు (ఆయాలు) విధుల్లో చేరారని చెప్పారు. వారితో కలుపుకుని జిల్లాలో మొత్తంగా 976 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, 717 మంది సహాయకులు విధుల్లో ఉన్నారని ఆమె వివరించారు. ఇంకా ఉద్యోగాల్లో చేరని వారికి తొలగింపు ఉత్తర్వులు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఉద్యోగాల్లో చేరని వారి స్థానంలో కొత్తవారిని నియ మిస్తామని తెలిపారు. కాగా జిల్లాలోని పది ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1425 అంగన్‌వాడీ ప్రధాన, 639 మినీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 3,489 మంది విధులు నిర్వహిస్తున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని, హామీలు నెరవేర్చాలని వారంతా గత కొద్దిరోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే.

తొలేళ్లు శంబరం

- జాతరలో తొలి అంకం పూర్తి
- పోలమాంబకు ప్రత్యేక పూజలు
- నేడు సిరిమానోత్సవం
- ఏర్పాట్లు పూర్తి



పూజలందుకున్న పోలమాంబ

మక్కువ/సాలూరు/సాలూరు రూరల్, జనవరి 22: భక్తజనులతో శంబర గ్రామం మురిసింది. అంతటా పోలమాంబ నామస్మరణ మార్మోగింది. ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోర్కెలు తీర్చే కల్పవల్లి శంబర పోలమాంబ జాతరలో తొలి అంకమైన తొలేళ్ల ఉత్సవాన్ని సోమవారం రాత్రి సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వహణకు ఎంపిక చేసిన వ్యక్తులు ఉపవాస దీక్షలో ఉండి.. మధ్యాహ్నం పోలమాంబకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఘటాలను ప్రత్యేకంగా అలంకరించి సాయంత్రం నుంచి డప్పుల వాయిద్యాలతో పొద్దుపోయిన వరకు తిరువీధి నిర్వహించారు. గ్రామంలో అమ్మవారి గద్దెకు వచ్చిన తర్వాత తొలేళ్ల ఉత్సవాన్ని నిర్వహించారు. దీక్షలో ఉన్న యువత అరకకు కాడెద్దులుగా నిలబడగా.. మరో వ్యక్తి కాడెపై నిల్చొని అమ్మవారి చదురుగుడి వైపు తిరిగి గ్రామం పాడి పంటలు, సిరిసంపదలతో తులతూగాలని వేడుకున్నా రు. అనంతరం అమ్మవారి గుడి నుంచి తెచ్చిన వరి విత్తనాలను గ్రామస్థులకు పంపిణీ చేశారు. వాటిని తీసుకున్న రైతులు తమ విత్తన ధాన్యంలో కలుపుకుని నారుపోయనున్నారు. కాగా జాతర తొలిరోజు స్వల్పసంఖ్యలోనే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.



ఘటాలకు పూజలు చేస్తున్న భక్తులు

ఏర్పాట్లు ఇలా..

శంబరలో ఐదు ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఫీడర్ అంబులెన్స్‌లు, మూడు 108 వాహనాలను, రెండు అగ్నిమాపక దళాలను అందుబాటులో ఉంచారు. ఉచిత, రూ. 10, రూ.50 దర్శనాలను ఏర్పాటు చేశారు. దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్‌లోనూ జారీ చేస్తున్నారు. క్యూలైన్‌లో చిన్నారులకు ఉచితంగా పాలు, భక్తులకు తాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారు. లడ్డూ , పులిహోర ప్రసాదం సిద్ధం చేశారు. గర్భిణులు, వృద్ధులు, దివ్యాంగు లకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. సాలూరు, పార్వతీపురం మున్సిపాల్టీలకు చెందిన సుమారు 100 మంది పారిశుధ్య పనుల్లో నిమగ్నమయ్యారు.

భారీ భద్రత

ఈ ఏడాది జాతరకు 600 మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ఐదుగురు డీఎస్పీలు, 15 మంది సీఐలు, 40 మంది ఎస్ఐలతో సహా ఆర్ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్‌సీలు, కాని స్టేబుళ్లు, హోంగార్డులు, ఏఆర్, ఎస్టీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు పనిచేయనున్నారు. సిరిమానోత్సవం సందర్భంగా రెండు డ్రోన్ కెమెరాలతో భద్రతను పర్యవేక్షించనున్నారు. శంబరలో 37 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మరోవైపు జాతర భద్రత ఏర్పాట్లను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ సోమవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు.

• 115 బస్సులు

సిరిమానోత్సవం సందర్భంగా ఈ నెల 23న శంబరకు 115 బస్సులను నడపనున్నట్టు జిల్లా ప్రజారవాణాధికారి టీవీఎస్ సుధాకర్ చెప్పారు. పార్వతీపురం, సాలూరు డిపోల నుంచి 30 చొప్పున 60 బస్సులు, పాలకొండ, ఎస్.కోట డిపోల నుంచి పదేసి చొప్పున 20, విజయనగరం డిపో నుంచి 20, శ్రీకాకుళం-2 డిపో నుంచి 15 బస్సులు వేసినట్లు చెప్పారు. వాటికి శంబరలో జడ్పీ ఉన్నత పాఠశాల, వనంగుడి సమీపంలో, ప్రైవేట్ వాహనాలకు మరోచోట పార్కింగ్ స్థలాలను కేటాయించారు.



• సిరిమానోత్సవానికి సర్వం సిద్ధం

జాతరలో ప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం మంగళవారం జరగనుంది. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది 28 అడుగుల సిరిమాను సిద్ధం చేశారు. అధికారులు మరోసారి దానిని పరిశీలించి సిరిమాను సామర్థ్య ధ్రువీకరణ పత్రాన్ని ఇవ్వనున్నారు. కాగా 23న మధ్యాహ్నం రెండు గంటలకు సిరిమానోత్సవం ప్రారంభమవుతుందని ఈవో సూర్యనారాయణ తెలిపారు. ఈ ఏడాది జన్ని పేకాపు భాస్కరరావు సిరిమాను అధిరోహించనున్నట్టు చెప్పా రు. తొలుత భాస్కరరావును చదురు గుడి నుంచి సాడేపు కుటుంబీకులు భుజాలపై మోసుకొని వస్తారు. అనంతరం ఆయన సిరిమానును అధిరోహిస్తారు. అప్పటికి మంగళ వాయిద్యాల మధ్య ఘటాలు సిరిమాను దగ్గరకు వస్తాయి. దీంతో సిరిమాను తొలుత గిరడ వారింటికి, అనంతరం కుప్పిలి, పూడి వారిళ్లకు వెళ్లి పూజలు అందుకుంటుంది. అనంతరం ఘటాలు దక్షిణ దిక్కుగా, సిరిమాను తూర్పు దిక్కుగా వెళ్తాయి. ఆ రెండూ పణుకు వీధిలో కలుస్తాయి. అక్కడ పొడిపిరెడ్డి కుటుం బీకులు, తీళ్ల వారి వారసులు, అక్యాన కుటుంబీకులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం సిరిమాను గొల్ల వీధి, కొత్త వీధి మీదుగా పెద్దమ్మ గుడి వద్దకు వెళ్తుంది. అక్కడ భక్తుల నుంచి పూజలు అందుకుంటుంది. అక్కడ నుంచి వెను తిరిగి నడివీధికి చేరుకొని ఆగిపోతుంది. అక్కడ సాడేపు కుటుంబీకులు మళ్లీ జన్ని పేకాపు భాస్కరరావును సిరిమాను నుంచి దించి భుజాలపై చదురుగుడికి తీసుకెళ్లనున్నారు.



భద్రత విధులకొచ్చిన పోలీసులు

వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడింది

రాజాం, జనవరి 22: సీఎం జగన్ సారథ్యంలోని వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని... సంక్షేమం కనుమరుగైందని మాజీ మంత్రి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నియంత పాలనలో ఆదాయం పెరగలేదని, యువతకు ఉద్యోగాలు రాలేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత బాదుడు కార్యక్రమం తప్ప సంక్రాంతి, క్రిష్టమస్, రంజాన్ తోఫా వంటి కానుకలు లేవన్నారు. చెల్లికి న్యాయం చేయలేని వారు ఇక ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణంతో పాటు అయిదేళ్లలో అభివృద్ధి, సంక్షేమం అంటే ఏమిటో చూపిస్తామన్నారు. 80 రోజుల పాటు యువత భవిష్యత్ కోసం పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు సుమల వెంకట మన్మధరావు, కిమిడి అశోక్ కుమార్, దుప్పలపూడి శ్రీనువాసరావు, వంగా వెంకటరావు, గురవాన నారాయణరావు, ముగడ శ్రీనివాసరావు, పాలూరి రామినాయుడు, కర్నేని మహేష్, మాడుగుల జయరాం, మంగం రమేష్, ధనుంజయ, చీడి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: రాష్ట్రానికి పూర్వ వైభవం రావాలన్నా, అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయన్నారు. నిత్యావసర ధరలు, విద్యుత్ చార్జీలు పెరిగిపోయాయన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. ● **విజయనగరం-రూరల్:** రాష్ట్రాభివృద్ధి, మాజీ ముఖ్యమంతి నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని విజయనగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పూసపాటి అదితి గజపతిరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో గడిచిన 5 ఏళ్లలో ఆదాయం పెరగలేదు, ఉద్యోగాలు రాలేదని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ హయాంలో నిత్యావసర ధరలు సామాన్యుడికి అందనంతగా ఉన్నాయన్నారు. చెత్తమీద పన్ను వేసే ముఖ్యమంత్రిగా జగన్ చరిత్రలో మిగిలిపోతారన్నారు. టీడీపీ హయాంలో సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానుకలు ఇచ్చేవారని, వాటిని జగన్ ప్రభుత్వం రద్దుచేసిందని గుర్తు చేశారు.


రాజాం: మాట్లాడుతున్న కోండ్రు మురళి



పార్వతీపురం, ఆంధ్ర జ్యోతి: రాష్ట్రంలో వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, తెలుగుదేశంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి మోహన్‌రావుతో కలిసి ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ కాలంలో నిత్యావసర సరుకుల ధరలు ఆకాశంలో ఉన్నాయన్నారు. విద్యుత్ చార్జీలు పెంచి ప్రజల నడ్డివిరిచారన్నారు. ఇరిగేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని ఆరోపించారు.

స్పందనకు 311 వినతులు

● వినతులు స్వీకరించిన డీఆర్‌వో


వినతులు స్వీకరిస్తున్న డీఆర్వో అనిత

కలెక్టరేట్: కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వివిధ సమస్యలపై 311 వినతులు వచ్చాయి. రెవెన్యూ సమస్యలపై 255 వినతలు, మున్సిపల్ శాఖకు 14, గ్రామ వార్డు సచివాలయం, పంచాయతీ విభాగం, డీఆర్‌డీఏ 10, వైద్య ఆరోగ్య, విద్యుత్ పంపిణీ సంస్థ, హౌసింగ్ 4 వినతులు వచ్చాయి. వీటిని డీఆర్‌వో ఎస్‌డీ అనిత, ఆర్‌డీవో సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వరరావు, సుదర్శన దొర, సుమబాల తదితరులు వినతులు స్వీకరించారు.

దౌర్జన్యాలకు పాల్పడితే కఠిన చర్యలు

● ఎస్పీ దీపిక ● స్పందన కార్యక్రమానికి 33 ఫిర్యాదులు

విజయనగరం క్రైం, జనవరి 22: జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో బెదిరింపులు, దౌర్జన్యాలకు పాల్పడేవారిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి, 33 ఫిర్యాదులు స్వీకరించారు. ● పూసపాటిరేగ మండలం కుమిలి గ్రామానికి చెందిన మహిళ, ఎస్పీ దీపికాకు ఫిర్యాదు చేస్తూ నెల్లిమర్ల మండలం రామతీర్థం జంక్షన్ వద్ద కూరగాయలు అమ్ముకుంటూ కుటుంబ పోషణ చేసుకుంటున్న తన వద్ద నెల్లిమర్లకు చెందిన వ్యక్తి వచ్చి అసభ్యపదజాలంతో దూషిస్తూ దౌర్జన్యం చేసి కూరగాయలు విక్రయించకుండా అడ్డుకుంటున్నారని న్యాయం చేయాలని కోరారు. ● డెంకాడ మండలం ఊడుకులపేట గ్రామానికి చెందిన మహిళ ఎస్పీ దీపికాకు ఫిర్యాదు చేస్తూ, తన బంధువుతో ఆస్తి వివాదం ఉందని, సదరు వ్యక్తి తన ఆస్తులను ఆక్రమించుకునే దురుద్దేశంతో బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని న్యాయం చేయాలని కోరారు. ● గరివిడి మండలం మందిరవలసకు గ్రామానికి చెందిన మహిళ ఎస్పీ దీపికాకు ఫిర్యాదు చేస్తూ, తనకు 2021లో వివాహం అయ్యిందని అప్పటి నుంచి భర్త, బంధువులు అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురి చేస్తున్నారని న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆమె విచారణ చేపట్టి చట్ట పరిధిలో ఫిర్యాదికి న్యాయం చేయాలని గరివిడి ఎస్ఐని ఆదేశించారు. ఫిర్యా దులు స్వీకరించిన అనంతరం ఎస్పీ దీపిక మాట్లాడుతూ తక్షణమే సమస్యలు పరిష్కరించి, తీసుకున్న చర్యలను నివేదించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆస్మాపరవీన్, విజయనగరం డీఎస్పీ గోవిందరావు, సీఐలు మురళీ, కేకే విజయనాథ్, ఎస్ఐలు సిద్ధార్థ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ దీపిక

గిరిశిఖర గ్రామంలో మృత్యుఘోష

● రోజుల వ్యవధిలో అనారోగ్యంతో ముగ్గురి మృతి

శృంగవరపుకోట రూరల్, జనవరి 22 : ఎస్.కోట మండలంలోని బొడ్డవర పంచాయతీ గిరిశిఖర గ్రామమైన చిట్టంపాడులో మృత్యు ఘోష వినిపిస్తోంది. అనారోగ్యంతో సోమవారం ఓ పసి బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. రోజుల వ్యవధిలో ముగ్గురు చనిపోవడం స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. అనారోగ్యం బారిన పడ్డాక సకాలంలో వైద్యుల వద్దకు తరలించలేకపోవడం ఈ మరణాలకు ఓ కారణం. చిన్నారి జన్ని ప్రవీణ్(18నెలలు) జ్వరంతో బాధపడుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందాడు. ప్రవీణ్ తండ్రి జన్ని సన్యాసిరావు, తల్లి సన్యాసమ్మలు మాట్లాడుతూ తమ బిడ్డకు గత శనివారం ఉన్నట్లుండి ఆరోగ్యం దెబ్బతిందని, ఏడు కిలోమీటర్లు డోలీలో తీసుకువెళ్లామని, రెండురోజుల వైద్యం తరువాత సోమవారం మరణించాడని వాపోయారు. మృతదేహాన్ని తీసుకురావడానికి వాహనం సమకూర్చలేదని కన్నీరుమున్నీరయ్యారు. స్థానిక గిరిజన యువకులు మాట్లాడుతూ చిట్టంపాడులో అనారోగ్యంతో ముగ్గురు మరణించారని తెలిపారు. రోడ్డు లేకపోవడంతో గిరిజనుల పరిస్థితి విషమిస్తోందని, ఆ తర్వాత వైద్యం అందించినా ప్రయోజనం ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.


చనిపోయిన బిడ్డతో సన్యాసమ్మ

యువకుడి ఆత్మహత్య

కురుపాం రూరల్: యువకుడు ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుమ్మగదబవలస గ్రామానికి చెందిన పేను సీమల నూకయ్య అలియాస్ సురేష్(36) ఎండీఎం వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య జ్యోతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం గుమ్మగదబవలస గ్రామ సమీపంలోని మామిడి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సురేష్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతుని భార్య ఫిర్యాదు మేరకు ఎల్విన్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించారు.

మద్యం సీసాల స్వాధీనం

రేగిడి: మండలం కొమిర గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తి నుంచి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ స్థానిక విలేకర్లకు తెలిపారు. సోమవారం నిర్వహించిన ఎన్నికల సోదాల్లో పట్టుబడిన నిందుతుడిపై కేసు నమోదుచేసి అరెస్టుచేసి కోర్టు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. హెచ్‌సీ శ్రీనివాసరావు, కానిస్టేబుల్ శివ తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: మండలంలోని సోంపురం జంక్షన్‌కి సమీపంలో 72 మద్యం బాటిళ్లతో ఒక వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్ఐ గోపాలరావు తెలిపారు. సోమవారం తమ సిబ్బందితో కలిసి సోంపురం జంక్షన్ వద్ద దాడిచేయగా వేపాడ మండలం అరిగిపాలెం గ్రామానికి చెందిన కే.సన్యాసిరావును మద్యం బాటిళ్లతో పట్టుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ దాడిలో హెచ్‌సీ పాపారావు, పీసీ పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల తొలగింపు అన్యాయం

దాసన్నపేట: సమస్యలు పరిష్కరించాలని, అమ్మలాంటి అంగన్‌వాడీ కార్యకర్తలు అభ్యర్థిస్తే, వారిని విధులనుంచి తొలగించటం ప్రభుత్వ దుర్మార్గపు చర్యని జనసేన నాయకులు గురాన అయ్యలు విమర్శించారు. సోమవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన ఉత్తర్వులను ఖండిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీలను విధులనుంచి తొలగించటం జగన్ నియంతృత్వానికి అద్దంపడుతుందన్నారు. వారిని విధులనుంచి తొలగించే అధికారం జగన్‌కు ఎవరిచ్చారని, జనసేన పార్టీ అంగన్‌వాడీలకు అండగా ఉంటుందన్నారు.

నేడు శంబర జాతరకు ప్రత్యేక బస్సులు

విజయనగరం రింగురోడ్డు: పార్వతీపురం-మన్యం జిల్లా మక్కువ మండలం శంబర పొలమాంబ జాతరకు విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి 40 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్టు జిల్లా ప్రజారవాణాధికారి సీహెచ్ అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి నుంచి డీబీ వలస, శంబర మీదుగా 20 బస్సులు నడుపుతున్నామన్నారు. గజపతినగరం-రామభద్రపురం నుంచి మెంటాడ మీదుగా 20 బస్సులు నడుపుతున్నట్టు తెలిపారు. భక్తులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ముగిసిన సోషల్ ఆడిట్

లక్కవరపుకోట: మండలంలోని ఆరు పంచాయతీల్లో సోమవారం సోషల్ ఆడిట్ ముగిసినట్లు ఏపీవో విజయలక్ష్మి తెలిపారు. కల్లెపల్లి, గంగుబూడి, గేదెల వానిపాలెం, కొట్యాడ, గొల్జాం, ఎల్.కోట గ్రామాల్లో ఆడిట్ ముగిసిందన్నారు. ఇందుకు సంబంధించిన ఖర్చుల వివరాలన్నీ మండల స్థాయి సమావేశంలో ప్రవేశపెడతామని తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలకు గదుల పరిశీలన

లక్కవరపుకోట: మండలంలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పాఠశాల తరగతుల గదులను తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి సోమవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఫిబ్రవరి 25న గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పరీక్షా కేంద్రాలను పరిశీలించి నివేదిక పంపాలని కోరడంతో సోమవారం ఏపీ మోడల్ స్కూల్, జెడ్పీ హైస్కూల్‌లను పరిశీలించినట్టు తహసీల్దార్ తెలిపారు. సుమారు 500 మంది పరీక్ష రాసేందుకు వీలుగా కేంద్రాలు ఉండాలని సమాచారం. ఈయన వెంట డీటీ రాజేశ్వరరావు, ఆర్ఐ ఉన్నారు.

సమాజానికి ఉపయోగపడేలా విధులు

విజయనగరం క్రైం: కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్లు సమాజానికి ఉపయోగపడేలా విధులు నిర్వర్తించాలని నాకిన్ చైన్నై అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీవాత్సవ్ సూచించారు. పోలీసు శిక్షణ కళాశాలలో కస్టమ్స్ ఇన్‌స్పెక్టర్ల రెండు వారాల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. విధుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన అంశాలపై దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపాల్ ఆనంద బాబు, వైస్ ప్రిన్సిపాల్ పీవీ అప్పా రావు, డీఎస్పీలు రామారావు, వీవీ అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యంతరాలు తెలపండి

రాజాం: ఓటర్ల జాబితాలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా తెలియజేయాలని నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారిణి ఎం.సుధారాణి సూచించారు. సోమవారం ఓటర్ల జాబితాను విడుదల చేసిన ఆమె వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమస్యలు ఉన్నట్టు గుర్తిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రస్తుతం జాబితాలో ఎటువంటి సమస్యలు కనిపించలేదని... అవసరమైతే ఫిర్యాదులు చేస్తామని టీడీపీ నాయకులు గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఎన్నికల డీటీ ప్రకాష్, నాయకులు పైల రాజరత్నం, మిత్తిరెడ్డి మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయండి

వేపాడ: విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గంలో ఈ నెల 27న నిర్వహించనున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనువాసరావు నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వేపాడలోని కల్యాణ మండపంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమిలిలో నిర్వహించనున్న సీఎం జగన్ సభను విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వానికి దళితులు బుద్ధి చెప్పాలి


దళిత సమస్యలపై చర్చిస్తున్న నేతలు

లక్కవరపుకోట, జనవరి 22: రాష్ట్రంలోని దళితులంతా ఏకమై జగన్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పాత్తేటి పెంటారావు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన దళిత నేతలతో కలిసి సమ స్యలపై చర్చించారు. కొట్యాడలో దళితులకు ఇచ్చిన భూములు ఇప్పటికీ రెగ్యు లరైజ్ చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలపై తహసీ ల్దార్‌తో చర్చించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి దళితులను పూర్తిగా మోసం చేశాడని మండిపడ్డారు. జగన్ దళిత ద్రోహి అని విమర్శలు గుప్పించారు. సుమారు 75 ఏళ్లుగా దళితులకు అందుతున్న 28 పథకాలను రద్దు చేసిన ఘనత జగన్‌దేనని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బుద్ధి చె ప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు వసంత అప్పారావు, నాగమణి, దోని అప్పారావు, సింహాద్రి, సన్యాసిరావు, వెంకటరావు పాల్గొన్నారు.

జగన్ సర్కారుపై బీసీలు ఎదురుతిరగాలి

రేగిడి, జనవరి 22: జగన్ సర్కారు బీసీలను అణగదొక్కి పాలన చేస్తోందని.. అటువంటి ప్రభు త్వాన్ని గద్దె దించే వరకు బీసీలు ఏకతాటిపై నిలబడి ఎదురు తిరగాలని విజయనగరం జిల్లా పార్లమెంటరీ టీడీపీ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు గురువాన నారాయణరావు, రాజాం నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు శాసపు లక్ష్మీ గోవిందనాయుడు పిలుపునిచ్చారు. ఉంగరాడమెట్ట అమరావతి తోటలో సోమవారం రేగిడి మండల జయహో బీసీ సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు బీసీ నేతలు మాట్లాడారు. ఈ ప్రభుత్వం రెడ్లకు అధిక ప్రాధాన్యమిచ్చి.. బీసీ కులాల వారికి సరైన ప్రాతినిధ్యం లేకుండా చేస్తోందని విమర్శించారు. బీసీ కార్పొరేషన్ నిధులు పక్కదోవ పట్టించి స్వయం ఉపాధి లేకుండా చేస్తున్నారని దుయ్యబట్టారు. బీసీలు ఏకతాటిపై నిలబడి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ నేతలు పాలూరి రామినాయుడు, గిరడ సింహాచలం, చల్ల భుజంగరావు, కెంబూరు కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

కుల గణన సమగ్రంగా చేపట్టాలి

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో కులగణనను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో రమామణి కోరారు. మండల కేంద్రంలో జరుగుతున్న కుల గణనను సోమవారం ఆమె పరిశీలించారు. ప్రజల సమగ్ర సమాచారం సక్రమంగా సేకరించాలన్నారు. కుల పేర్లను జాగ్రత్తగా నమోదు చేయాలన్నారు. వీటిని సచివాలయ కార్యదర్శులు దగ్గరుండి పర్యవేక్షించాలన్నారు.

రాజాం: మండలం ఒమ్మి కంచరాం గ్రామాల్లో కులగణన కార్యక్రమాన్ని ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. ప్రతి ఇంటికీ వెళ్లి కులగణన చేపట్టాలని ఆదేశించారు. కులగణన సర్వేలో ఎటువంటి లోపాలు వచ్చినా సచివాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

తెర్లాంలో ఎంపీడీవో 'స్పందన'

తెర్లాం: ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సోమవారం మండల కార్యాలయంలో స్పందన నిర్వహించారు. తెర్లాం గ్రామానికి చెందిన ఎస్.కొండలరావు 306-1 సర్వేలో 4-52లో గల కృష్ణంనా యుడు చెరువు దురాక్రమణకు గురైందని, గత తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా సర్వే రాళ్లు వేశారని, వాటిని తొలగించి ఇప్పుడు పనులు ప్రారంభిస్తున్నారన్నారని ఫిర్యాదు చేశారు.

కల్లుగీత వృత్తి సర్వనాశనం

శృంగవరపుకోట, జనవరి 22: కల్లుగీత వృత్తిని ఈ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రైల్వే స్టేషన్ రోడ్డు లోని ఎస్ఈబీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి... ఆందోళన చేశారు. కల్లు గీత వృత్తిని బతికించాలని, ప్రమాదంలో మరణించిన వారికి రూ.25 లక్షలు పరిహారం ఇవ్వాలని కోరుతూ ఎస్ఈబీ సీఐ ధర్మారావుకు వినతిపత్రం అందించారు. సీపీఐ నాయకుడు డేగల అప్పలరాజు, మద్ది కృష్ణ, కండిపల్లి దే ముడు, కాళ్ల కృష్ణ, కల్లుగీత వృత్తిదారుల సంఘ నాయకులు కుప్ప రమణ, కె.అప్పారావు, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఎస్.కోట ఎస్ఈబీ వద్ద ఆందోళన చేస్తున్న కల్లుగీత కార్మికులు, సీపీఐ నాయకులు

మహిళలతో గౌరవంగా ఉండాలి

విజయనగరం క్రైం: పనిచేసే చోట తోటి ఉద్యోగినులు, మహిళా సిబ్బంది పట్ల పురుష ఉద్యోగులు సోదర భావంతో మెలగాలని, వారిని లైంగిక వేధింపులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని దిశ పోలీస్ స్టేషన్ సీఐ బి.నాగేశ్వరావు అన్నారు. సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013 గోడపత్రికను దిశ సి.ఐ. నాగేశ్వరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సి.ఐ. మాట్లాడుతూ పనిచేసే చోట మహిళలపై లైంగిక వేధింపులు నిరోధించే కమిటీలు ప్రతిచోటా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో దిశ వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కె.రమాదేవి, ఎ.ఎస్.ఐ. బి.శోభారాణి, సిబ్బంది పాల్గొన్నారు.


సీఐ నాగేశ్వరావుకు పోస్టర్‌ను అందజేస్తున్న వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది

సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల జిల్లా కమిటీ

విజయనగరం దాసన్నపేట : ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య జేఏసీ జిల్లా కమిటీ నూతన కార్యవర్గం ఎంపికైంది. కేఎల్‌పురంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆర్.శ్రీనివాస్ అధ్యక్షతన ఈ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా కె.గురువులు, కార్యవర్గ అధ్యక్షుడిగా రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడిగా పి.తేజశ్వరీ, ఎన్.పద్మ, రాంబాబు, బి.జయగణేష్, ప్రధాన కార్యదర్శిగా రమాదేవి, అదనపు కార్యదర్శిగా ఆర్.శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా డి నర్సింహం, బి.నారాయణమూర్తి, టి.చిన్నతల్లి, వంశీకృష్ణ, ఎం.రాజులు, కోశాధికారిగా వి.సింహాచలం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడిగా జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు కాంతారావును ఎన్నుకున్నామని జిల్లా గౌరవ అధ్యక్షుడు జి.అప్పలసూరి అన్నారు.


నూతన కార్యవర్గం

ర్యాంపు నిర్మాణం పూర్తి చేయాలి

వంగర, జనవరి 22: పాఠశాలల్లో అర్థాంతరంగా నిలిచిపోయిన ర్యాంపుల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈవో దుర్గారావు సూచించారు. సోమవారం వంగర, కొప్పర, సంగాం తదితర గ్రామల్లో ర్యాంపులు పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎంలు రామకృష్ణ, గిరి తదితరులు ఉన్నారు.


ర్యాంపుకు కొలతలు తీస్తున్న దృశ్యం

ముగిసిన చుక్కమాంబ తీర్థం

వేపాడ, జనవరి 22: అరిగిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ దేవత చుక్కమాంబ తీర్థ మహోత్సవం సోమవారం మూడో రోజు కూడా వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అండర్-17 కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


కబడ్డీ ఆడుతున్న యువకులు

కడుబండికి టిక్కెట్ ఇస్తే పనిచేసేది లేదు

● జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీల స్పష్టీకరణ

కొత్తవలస, జనవరి 22: 'పార్టీనైనా మారుతాం గానీ ఎమ్మెల్యే టిక్కెట్‌ను కడుబండి శ్రీనివాసరావుకు ఇస్తే పని చేసేది లేదని నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ముఖ్య నాయకులు మరోసారి స్పష్టం చేశారు. సోమవారం కొత్తవలసలోని రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలనాయుడు బాబు కార్యాలయంలో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, నాయుడుబాబుతో వీరంతా సమావేశమయ్యారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులను దుర్భాషలు ఆడేవారని... తమకు పనులు చేయకపోయినా ఫర్వాలేదు కానీ అవమానపరిస్తే ఎలా భరించగలమని ఒక్కొక్కరుగా ఆవేదనను వెళ్లగక్కారు. మళ్లీ కడుబండి శ్రీనివాసరావుకు టిక్కెట్ ఇస్తే తమకు నచ్చిన పార్టీలోకి వెళ్లిపోతామని స్పష్టం చేశారు. ● తాము ఎప్పుడూ పార్టీ కేడర్ అభిప్రాయాలను గౌరవిస్తామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు అన్నారు. తమపై రక రకాలుగా దుష్ప్రచారాన్ని మొదలు పెట్టారన్నారు. తనకు ముందు కొప్పల వెలమ కార్పొరేషన్ పదవి ఇచ్చారని.. తరువాత డీసీసీబీ పదవి ఇచ్చారని తెలి పారు. దీన్ని జీర్ణించుకోలేక డీసీసీబీ పదవి పోగొట్టడానికి పలుమార్లు అమరావతి వెళ్లి ఫైరవీలు చేశారని నాయుడుబాబు ఆరోపించారు.


నెక్కల, రఘురాజు ముందు తమ అభిప్రాయాలను చెబుతున్న నాయకులు

దళిత సర్పంచ్ అంటే అంత చులకనా?

● సర్వసభ్య సమావేశంలో బాడంగి సర్పంచ్

బాడంగి, జనవరి 22: 'దళిత సర్పంచ్ అంటే అంత చులకనా?' అని బాడంగి మండల కేంద్ర సర్పంచ్ కంది రమేష్ ప్రశ్నించారు. సోమవారం ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సభలో సర్పంచ్ కంది రమేష్ మాట్లాడుతూ మూడేళ్ల నుంచి ఎస్సీ వీధిలో ఉన్న భవనాన్ని తొలగించి కొత్తది మంజూరు చేయాలని కోరుతున్నా ఎంఈవో రాజే శ్వరి పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ ఏపీవో భాగ్యలక్ష్మి గత మూడేళ్ల నుంచి ఆ శాఖకు సంబంధించిన ఏ సమాచారాన్నీ చెప్పడం లేదని నిలదీశారు. సభలకు రావొద్దంటే మానేస్తామని.. సమస్యలపై మాట్లాడే మా గొంతు నొక్కితే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానన్నారు. టీడీపీ వైస్ ఎంపీపీ సింగిరెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ ఆరు నెలల నుంచి రేషన్ బియ్యాన్ని వాహనం ద్వారా ఇవ్వడం లేదని వాపోయారు. టీడీపీ సర్పంచ్‌పాలవలస గౌరు మాట్లాడారు.


మాట్లాడుతున్న బాడంగి సర్పంచ్

మొండి వైఖరి తగదు

● ప్రభుత్వంపై విరుచుకుపడిన అంగన్‌వాడీలు

● కొనసాగిన సమ్మె

అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం మొండి వైఖరి తగదని ఆ సంఘ యూనియన్ నాయకులు అసహనం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారంతో 42వ రోజుకు చేరుకుంది. సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు ప్రభుత్వం దుర్మార్గపు చర్య చేపట్టడం తగదన్నారు. రాస్తారోకోలు, మానవహారం నిర్వహించారు. సమస్యలను పరిష్కరించేంత వరకు న్యాయపరమైన పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



గజపతినగరం: ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి రాస్తారోకో


ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అంగన్‌వాడీల మానవహారం


జామిలో అంగన్‌వాడీలకు నగదు అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

అంతటా రామనామ స్మరణ


గరుగుబిల్లి: దత్తివలసలో విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

- అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ
- జిల్లా వ్యాప్తంగా రామాలయాల్లో ప్రత్యేక పూజలు
- ఘనంగా శోభాయాత్రలు

అయోధ్యలో బాలరాముడు విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న రామాలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. శ్రీరామ నామ జపంతో ఆలయాలన్నీ మార్మోగాయి. పలు గ్రామాల్లో ఘనంగా శోభాయాత్రలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, జైశ్రీరామ్.. అంటూ నినాదాలు చేశారు. ఇళ్లల్లో దీపాలు వెలిగించి, పూజలు చేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)


పార్వతీపురం: ఊరేగింపులో పాల్గొన్న టీడీపీ నాయకుడు విజయచంద్ర, బీజేపీ నేత శ్రీనివాసరావు


భామిని: సొలికిరిలో వేషధారణలతో ఊరేగింపు


పాలకొండలో శోభాయాత్ర


గరుగుబిల్లి: సొంబన్నవలసలో..


గుమ్మలక్ష్మీపురం: ర్యాలీ చేస్తున్న రామభక్తులు


పార్వతీపురంటౌన్: పట్టణంలో శోభాయాత్ర



జియ్యమ్మవలస: చినమేరంగిలో,
కురుపాం రూరల్: మొండెంఖల్‌లో పల్లకిలో ఊరేగింపు


సాలూరు రూరల్: సాలూరు డబ్బివీధిలో మహిళల కోలాటం


పార్వతీపురం రూరల్: ములగలో ప్రత్యేక పూజలు


కురుపాం: శోభాయా త్ర నిర్వహిస్తున్న దృశ్యం

స్పందనకు వినతుల వెల్లువ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో వినతులు సమర్పించారు. సోమవా రం కలెక్టర్ నిశాంత్ కుమార్ నేతృత్వంలో జేసీ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్, డీఆర్వో జె.వెంకటరావు, కేఆర్సీ ఎస్‌డీసీ కేశవనాయుడు ప్రజల నుంచి 140 వినతులను స్వీకరించారు. సాలూరు మండలం రాంపాడులో ఆశ వర్కర్‌ను నియమించాలని సర్పంచ్ ఎండమ్మ, గ్రామస్థులు వినతిపత్రం అందించారు. అలాగే సొంపిగం నుంచి రాంపాడు గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని కోరారు. పార్వతీపురం మండలం పనసభద్ర గ్రామానికి సీసీ రోడ్డు, కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు, కాలువలు మంజూరు చేయాలని కళావతి, గ్రామస్తులు అర్జీ ఇచ్చారు. పార్వతీపురం మండ లం నర్సిపురం గ్రామానికి చెందిన టి.కాశియ్యకు ఆరు నెలల నుంచి వృద్ధాప్య పింఛను రావడం లేదని, ఇప్పించాలని కోరారు. అనంతరం జేసీ గోవిందరావు పలువురికి ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌వో బి.జగన్నాథరావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

ఎరువులను అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవు

గరుగుబిల్లి: ఎరువులను అధిక ధరలకు అమ్మకాలు చేస్తే చర్యలు తప్పవని పాలకొండ వ్యవసాయ సహాయ సంచాలకురాలు కె.రత్నకుమారి హెచ్చరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను ఆమె సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఖడ్గవలస సముదాయంలోని శ్రీగాయత్రి జనరల్ ఎరువుల దుకాణంలోని నిల్వలను పరిశీలించారు. సంబంధిత డీలరు వద్ద సరైన రికార్డులు లేకపోవడంతో లక్ష రూపాయలు విలువ చేసే యూరియాను సీజ్ చేశారు. రైతులకు ఎరువులు అమ్మే సమయంలో విధిగా రశీదులు అందించాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పరిశీలనలో మండల వ్యవసాయాధికారిణి ఆర్.విజయభారతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ

కురుపాం: కురుపాం సామాజి క ఆరోగ్య కేంద్రాన్ని జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎ.రమేష్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఉన్న మందులు, అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. అత్యవసరమైన పాము కాటుకు ఇచ్చే ఇంజక్షన్‌లు ఉన్నాయా అని ఆసుపత్రి సూపరింటెండెంట్ శోభారాణిని అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, బ్లడ్‌బ్యాంకులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది ఐ.వాసు దేవరావు, అశోక్ పాల్గొన్నారు.


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న న్యాయాధికారి రమేష్

25న ఓటరు దినోత్సవంపై చిత్రలేఖన పోటీలు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఈ నెల 25న జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్టు ఆర్డీఓ కె.హేమలత ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రాధాన్యత అనే అంశంపై జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి 10 వరకు కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. పాఠశాల, కళాశాల విద్యార్థులు, ఆసక్తి ఉన్న పౌరులు పాల్గొనవచ్చునన్నారు.

అక్రమ కేసులపై ఆదివాసీల నిరసన

సీతంపేట: రాష్ట్ర ప్రభుత్వం బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలనే ప్రతిపాదనను నిరసిస్తూ గత ఏడాది మార్చి 30న మన్యం బంద్ చేపట్టారు. దీనిపై అప్పట్లో సీతంపేట పోలీస్‌స్టేషన్‌లో 40మంది ఆదివాసీలపై కేసులు నమోదు చేశారు. వీరందరికీ సోమవారం స్థానిక కోర్టులో విచారణకు హాజరుకావాలని నోటీసులు అందించారు. దీనిని నిరసిస్తూ సోమవారం ఐటీడీఏ ఆవరణలో ఉన్న ఏజెన్సీ కోర్టుకు హాజరై తమ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిడ్డిక అప్పారావు, బిడ్డిక దమయంతినాయుడు, హెచ్.ప్రసాద్, భారతి తదితరులు పాల్గొన్నారు.


అక్రమ కేసులు నిరసిస్తున్న ఆదివాసీ నాయకులు

ఎన్నాళ్లీ కష్టాలు?

పార్వతీపురంటౌన్: పండుగకు తమ స్వగ్రామాలకు వచ్చి తిరిగి వెళ్లాలనుకునే ప్రయాణికులకు సోమవారం కూడా అవస్థలు తప్పలేదు. పార్వతీపురం ఆర్టీసీ బస్సు డిపో నుంచి విశాఖ, విజయవాడ, హైదరాబాదు తదితర ప్రాంతాలకు వెళ్లాలనుకునే వలస ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. పార్వతీపురం మీదుగా వెళ్లే రైళ్లు రద్దు కావడంతో ఆర్టీసీ బస్సులే శరణ్యమయ్యాయి. గంటల కొద్దీ కాంప్లెక్స్‌లో నిరీక్షించి, తమ గమ్య స్థానాలను చేరుకునేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించక తప్పలేదు.


కాంప్లెక్స్‌లో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

గ్రంథాలయాలను వినియోగించుకోండి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలోని గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఉల్లిభద్ర సర్పంచ్ శెట్టి దివ్యలక్ష్మి సూచించారు. అభిలాష కార్యక్రమంలో భాగంగా ఉల్లిభద్ర గ్రామంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని ఆమె సోమవారం ప్రారంభించారు. కార్యదర్శి కోటేశ్వరరావు, ఎం.శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల హక్కులను కాపాడాలి

బెలగాం: జిల్లాలోని వివిధ ప్రాంతాల గిరిజనులకు సాగు భూమి ఇచ్చి, సాగు నీరు అందించాలని, గిరిజనుల హక్కులను కాపాడాలని గిరిజన సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గిరిజనులు ఆందోళన చేపట్టారు. సీతంపేట మండలంలోని గిరిజనులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న భూమిని కబ్జాదారులు, కొందరు అధికారులు రికార్డులు మార్చి ఆక్రమించారని ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని, గిరిజనులపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. వెంటనే రికార్డులను సరిచేసి అర్హులైన గిరిజనులకు సాగు భూమి ఇవ్వాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. గుమ్మలక్ష్మీపురం, భామిని, వీరఘట్టాం తదితర ప్రాంతాల్లో గిరిజనుల భూములను ఆక్రమణదారుల చెర నుంచి రక్షించి నిజమైన గిరిజనుడికి ఇవ్వాలని, లిఫ్ట్ ఇరిగేషన్, చెక్‌డ్యాంలు నిర్మించి సాగు నీరు అందించి ఉపాధి కల్పించాలని కోరారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నూరు శాతం గిరిజనులు ఉన్న ప్రాంతాలను ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తించాలని, 1/70 చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో గిరిజన సంఘం నాయకులు వి.త్రినాథ్, ఎస్.వాసుదేవరావు, పి.కన్నా, ఎస్.తెల్లయ్య, పెద్దఎత్తున గిరిజనులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపడుతున్న గిరిజనులు

అరకొర నిధులతోనే మరమ్మతులు

గరుగుబిల్లి: గతుకులమయమైన ప్రధాన రహదారుల మరమ్మతులకు అరకొర నిధులు మంజూరు చేయడంతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. పార్వతీపురం ప్రధాన రహదారి నుంచి తోటపల్లి, రావివలస తదితరులు రహదారులు అధికంగా మరమ్మతులకు గురయ్యాయి. భారీ స్థాయిలో గోతులమయం కావడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి . ప్రస్తుతం పార్వతీపురం ప్రధాన రహదారి నుంచి మరమ్మతులకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు చేస్తే.. రూ. 2 లక్షలు మంజూరయ్యాయి. ప్రస్తుతం కేటాయించిన నిధులు అడ్డాపుశీల నుంచి ఉల్లిభద్ర వరకు సర్దుబాటు అవుతున్నాయి మిగిలిన రహదారుల పరిస్థితి అయోమయంగా తయారైంది.


ఉల్లిభద్ర ప్రధాన రహదారికి మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

ప్రణాళికలపై అవగాహన

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో అభివృద్ధికి సంబంధించి ప్రణాళికలపై దృష్టి సారించాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు సూచించారు. సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ వార్డు సభ్యులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా వీరు మాట్లాడుతూ అభివృద్ధిలో వార్డు సభ్యులు అత్యంత కీలకమన్నారు. వార్డుల పరిధిలోని సమస్యలను గుర్తించి పరిష్కారానికి ప్రణాళికల తయారీకి శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ఎన్.నాగభూషణరావు, ఏవో ఎన్.అర్జునరావు, ఏపీవో ఎం.గౌరీనాథ్, వెలుగు సీసీ సీహెచ్ తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

కళా ప్రదర్శనలో రాజారావు ప్రతిభ

భామిని: ఉమ్మడి జిల్లాల కళా ప్రదర్శనలో సొలికిరి గ్రామానికి చెందిన కొత్తకోట రాజారావు ప్రతిభ కనబరిచారు. హిరమండలంలో సీమకోట కళాపీఠం వార్షికోత్సవం సందర్భంగా గోరేటి వెంకన్న జానపద కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాజారావు పాల్గొని, హరిశ్చంద్ర కాటిసీను ఏకపాత్రాభినయంలో మూడో స్థానం సాధించారు. తోటి కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.


రాజారావుకు బహుమతి అందజేస్తున్న గోరేటి వెంకన్న

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలి

గుమ్మలక్ష్మీపురం: అంగన్‌వాడీల సమ్మెకు మద్దతుగా ఈనెల 24న చేపట్టనున్న రాష్ట్ర బంద్‌కు ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు, వివిధ పార్టీలు మద్దతు తెలిపాలని గిరిజన సంఘం నాయకులు మండల రమణ, అవినాష్ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకంగా ఈ బంద్‌ను జయప్రదం చేయాలని వారు ఒక ప్రకటనలో కోరారు.

ప్రజా సంకల్పం నుంచి పారిపోతున్న జగన్



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

సాలూరు: రాష్ట్రంలో ప్రజా సంకల్ప యాత్ర పేరుతో ప్రజల మధ్యకు వచ్చి అన్ని సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన వైఎస్ జగన్ ఆ సంకల్పం నుంచి పారిపోయి జనాలకు దూరంగా దాక్కునే ప్రయత్నం చేస్తున్నారని సీపీఎం నాయకులు విమర్శించారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా పట్టణంలో మున్సిపల్ కార్యాలయానికి సమీపంలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. నాయకులు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీలు శాంతియుతంగా సమ్మె చేస్తుంటే విజయవాడకు వారిని చేరుకోనివ్వకుండా పోలీసులతో ఉద్యమాన్ని అణచివేస్తున్నారని అన్నారు. ఈ ప్రభుత్వానికి ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

సీతంపేట: ఐటీడీఏ సమీపంలో ఈనెల 20న రాత్రి సమయంలో కొత్తూరు నుంచి సీతంపేట వైపు వస్తున్న లారీ అదుపు తప్పి సెంటర్ లైటింగ్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సెంటర్ లైట్ స్తంభం పూర్తిగా విరిగిపడిపోయి రోడ్డుకు అడ్డంగా పడిపోయినప్పటికీ దీనిని ఎవరూ తొలగించలేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్ద సంఖ్యలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన వాహనాలు విశాఖకు సరుకు రవాణా చేస్తున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో సెంటర్ లైటింగ్‌ను ఢీకొట్టుకొని వెళ్లిపోతున్నాయి. ఇటీవల ఇసుక లారీ కూడా సెంటర్ లైటింగ్‌ను ఢీకొట్టిన ఘటన మరువక ముందే మరో సెంటర్ లైటింగ్ స్తంభాన్ని ఢీకొట్టాయి. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ధ్వంసమైన స్తంభాన్ని రోడ్డుకు అడ్డంగా లేకుండా తొలగించాలని కోరుతున్నారు.


ప్రమాదకరంగా ఉన్న సెంటర్ లైటింగ్ స్తంభం

టీకా కార్యక్రమం బలోపేతం చేయాలి

బెలగాం: శిక్షణను సద్వినియోగం చేసుకుని టీకా కార్యక్రమాన్ని బలోపేతం చేయాలని డీఎంహెచ్‌వో బి.జగన్నాథం అన్నారు. సోమవారం స్థానిక ఎన్జీహోంలో టీకా కార్యక్రమంపై శిక్షణ నిర్వహించారు. వైజాగ్ జోన్ డబ్ల్యూహెచ్‌వో బృందం పవర్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. వ్యాక్సిన్ నివారిత వ్యాధుల నియంత్రణకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఐవో నారాయణరావు, డీఎంవో టి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఐటీడీఏ స్పందనకు 40 వినతులు

సీతంపేట: ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 40 వినతులు వచ్చినట్టు పీవో కల్పనా కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, పీఏవో హరికృష్ణ, ప్రాజెక్టు ఉద్యానవనాల అధికారి గణేష్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నేడు బీసీ సాధికార సదస్సు

గరుగుబిల్లి: రావివలస గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో మంగళవారం కురుపాం నియోజకవర్గ స్థాయి బీసీ సాధికార సదస్సు నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, అరకు పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు కోట భరత్‌కుమార్ తెలిపారు. సోమవారం వీరు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు. మాజీ మంత్రి శత్రుచర్ల విజయ రామరాజు, టీడీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి హాజరవు తున్నారన్నారు. నియోజకవర్గ పరిధిలోని పార్టీ ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో పాటు కార్యకర్తలు హాజరుకావాలని వారు కోరారు.

అదృశ్యమైన మహిళ అప్పగింత

గరుగుబిల్లి: వల్లరిగుడబ గ్రామానికి చెందిన మండ లక్ష్మి ఈనెల 18న ఇంటి నుంచి అలిగి వెళ్లిపోయింది. ఈ మేరకు ఆమె తల్లి సరస్వతి ఈనెల 20న గరుగుబిల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో స్థానిక హెచ్‌సీ ఎస్.ఈశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. స్థానికులు, కుటుంబ సభ్యుల సమాచారం మేరకు విశాఖపట్నంలో లక్ష్మి ఉన్నట్లు గుర్తించారు. సిబ్బంది సహాయంతో రప్పించి, తల్లికి సోమవారం అప్పగించారు. భర్తతో స్వల్ప మనస్పర్థల కారణంగా ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిందని చెప్పారు. లక్ష్మి ఆచూకీ తెలుసుకోవడంలో సచివాలయ మహిళా పోలీసు గొర్లి భవాని చొరవ చూపారు.

పార్వతీపురం రూరల్ సీఐగా రవికుమార్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురం రూరల్ సీఐగా కె.రవికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. రాజాం టౌన్ సీఐగా విధులు నిర్వహించిన ఈయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. శాంతి భద్రతలకు విఘాతం లేకుండా చర్యలు తీసుకుంటానన్నారు.

ఎస్కేపాడు పార్క్ పనులు పూర్తి చేయాలి

గుమ్మలక్ష్మీపురం: ఎస్కేపాడు సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ ఆదేశించారు. ఎస్కేపాడు ఉద్యాన నర్సరీలో చేపడుతున్న పర్యాటక సుందరీకరణ పనులను ఆయన సోమవారం పరిశీలించారు. పనులు చేపట్టడంలో జాప్యం చేయవద్దన్నారు. పర్యాటక నిలయాలుగా ఈ ప్రాంతం మారాలన్నారు. అనంతరం పార్క్‌లో మౌలిక సదుపాయా ల కల్పనకుగాను కొనుగోలు చేసిన సామగ్రిని ఆయన తనిఖీ చేశారు.

రాయగడకు కొత్త కలెక్టర్

ఒడిశా

రాయగడ: రాయగడ జిల్లా నూతన కలక్టర్‌గా ప్రమోద్‌సత్యబాన్ మహాజన్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 2019 కేడర్‌కు చెందిన మహాజన్.. సుందర్‌ఘడ్ జిల్లా, జడ్పీ సీడీవో కమ్ ఈవోగా విధులు నిర్వహించారు. ఇంతవరకు రాయగడ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన స్వధాదేవిసింగ్‌ను నయాగడ్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ బదిలీ ప్రాముఖ్యతను సంతరించుకుంది.


కలెక్టర్ ప్రమోద్

రామనామ స్మరణతో పులకించిన పట్టణం

రాయగడ: అయోధ్యలో శ్రీరామచంద్రుని విగ్రహ ప్రాణప్రతిష్ఠ శుభ వేడుకను పురస్కరించుకుని పట్టణంలో వివిధ సంఘాల ప్రతినిధులు, భక్తులు రామాలయాల్లో రామ నామ సంకీర్తనం చేశారు. యువత నగరంలో రాముని జెండాలతో జైశ్రీరాం నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రతి వీధి రామనామ స్మరణతో మారుమ్రోగింది. రామ మందిరాల్లో మహిళా భక్తులు రామాయాణ పారాయణం చేసి ర్యాలీ చేశారు.


ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు